క్లుప్తంగా

ఉత్సవానికి సిరిమాను సిద్ధం



పూజలందుకుంటున్న సిరిమాను

విజయనగరం టౌన్: పైడితల్లమ్మ ఉత్సవానికి సిరిమాను సిద్ధమైంది. హుకుంపేటలో ఉన్న పూజారి బంటుపల్లి వెంకటరావు ఇంటివద్ద ఉన్న చింతమానును సిరిమానుగా మలిచే ప్రక్రియ కొలిక్కి వచ్చింది. భక్తులు సిరిమానుకు పసుపు, కుంకుమ పూసి ప్రత్యేక పూజలు చేశారు. ఘటాలతో నీటిని తీసుకువచ్చి సిరిమానుకు అభిషేకం చేశారు. ఈ నెల 31న సిరిమానోత్సవం నిర్వహించనున్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



సింగవరంలో సస్యరక్షణపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

డెంకాడ: వర్షాభావ పరిస్థితుల్లో వరి పంటను కాపాడుకునేందుకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. గత 15 రోజులుగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్నందున పంటకు కావాల్సిన నీరు అందక ఎండిపోయే అవకాశం ఉందన్నారు. చిరుపొట్ట దశలో ఉన్న వరిపంటను కాపాడుకునేందుకు 10-0-45 మందును ఎకరానికి 2 కిలోలు 200 వందల లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయడం ద్వారా పంటను 5 నుంచి 10 రోజుల పాటు రక్షించుకోవచ్చని వ్యవసాయాధికారి పూడి నిర్మల సూచిస్తున్నారు. ఈ మేరకు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు



చదురుగుడి వద్ద డీవీ మధుమూర్తి శాస్త్రీయ సంగీత కచేరీ

విజయనగరం టౌన్: శ్రీపైడితల్లి జాతర మహోత్సవాల్లో భాగంగా దేవాదాయశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆద్యంతం ఆహూతులను ఆకట్టుకుంటున్నాయి. స్థానిక మూడు లాంతర్ల వద్ద ఉన్న చదురుగుడి ఆవరణలో డీవీ మధుమూర్తిచే శాస్త్రీయ సంగీత కచేరి ఏర్పాటు చేశారు. అదేవిధంగా రైల్వేస్టేషన్ వద్ద ఉన్న వనంగుడి ఆవరణలో గుడివాడ అగ్రహారానికి చెందిన గుడివాడ లక్ష్మీనారాయణచే హరిశ్చంద్ర ఏకపాత్రాభినయం, థామస్‌పేటకు చెందిన కొండేటి నారాయణస్వామి అర్జునుడి ఏకపాత్రాభినయం, వెంకటరావు బృందం ఆలపించిన భక్తిగీతాలు వీక్షకులను కట్టిపడేశాయి. అనంతరం ఆలయ అధికారులు కళాకారులను ఘనంగా సత్కరించారు.

29న ఏపీటీఎఫ్ ధర్నా



ప్రచార పోస్టర్‌ని విడుదల చేస్తున్న జిల్లా కమిటీ సభ్యులు

విజయనగరం అర్బన్: విజయవాడ ధర్నా చౌక్ వద్ద ఈ నెల 29న నిర్వహిస్తున్న ధర్నాను విజయవంతం చేయాని ఏపీటీఎఫ్ జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. స్థానిక ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. ఉద్యోగుల అవసరాల కోసం దాచుకున్న వివిధ ఖాతాల నుంచి చెల్లించాల్సిన బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగులకు జీతాలను సకాలంలో ఇవ్వడం లేదని ఆరోపించారు. అవసరానికి ఇవ్వాల్సిన బిల్లులు కూడా పెండింగ్ పెడుతోందని మండిపడ్డారు. అంతకుముందు ధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. జిల్లా అధ్యక్షులు డి.ఈశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆర్.కృష్ణ, ఎస్‌వీ పైడిరాజు, ఏవీ శ్రీనివాసరావు, మధుసూదనరావు, సీహెచ్.రామారావు, డి.వెంకటనాయుడు, పి.దామోదరనాయుడు, వి.అప్పలరాజు, సత్యనారాయణ, సత్యారావు, ఎస్.శ్రీదేవి పాల్గొన్నారు.

ఉజ్వల పథకంతో పేదలకు మేలు

చీపురుపల్లిరూరల్(గరివిడి): ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకంతో పేదవారికి ఎంతో మేలు చేకూరు తుందని బీజేపీ మండలఅధ్యక్షుడు ఇప్పిలి నీలకంఠం అన్నారు. మండలంలోని రామలింగాపురం గ్రామాని కి చెందిన ముగ్గురు లబ్ధిదారులకు ఉజ్వల యోజన పథకం కింద ఉచితంగా గ్యాస్ స్టవ్,సిలిండర్లను పట్టణంలో మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం ఉచితంగా గ్యాస్ స్టవ్, సిలిండర్‌లు అందిస్తోందని చెప్పారు.

ఊరూరా దసరా సందడి

- విజయదశమిని పురస్కరించుకుని ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- అమ్మవారికి ప్రత్యేక పూజలు



విజయనగరం: బాబా మెట్ట వద్ద దుర్గమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల



నెల్లిమర్ల రూరల్: కొత్తపేట సత్యనారాయణస్వామి ఆలయంలో దుర్గమ్మకు పడిపూజలు చేస్తున్న భక్తులు



విజయనగరం టౌన్: రైల్వేస్టేషన్ ప్రాంగణంలో పూలందుకుంటున్న దుర్గామాత



విజయనగరం టౌన్: వసంతవిహార్ వద్ద ఏర్పాటుచేసిన దుర్గాదేవి విగ్రహం



విజయనగరం టౌన్: గాడీఖానా వద్ద 25 శిరస్సులతో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహం



విజయనగరం టౌన్: రాజరాజేశ్వరీదేవీగా భక్తులకు దర్శనమిస్తున్న పైడితల్లి



నెల్లిమర్ల రూరల్: బూరాడపేట బాలాత్రిపురసుందరీదేవి ఆలయంలో అమ్మవారికి అభిషేకం చేస్తున్న అర్చకులు

శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. విజయదశమి సందర్భంగా మంగళవారం ఆలయాలకు భక్తులు పోటెత్తారు. అమ్మవారిని దర్శించుకుని, కుంకుమ పూజలు, అభిషేకాలు చేశారు. ఆలయాల ప్రాంగణంలో వాహన పూజలు నిర్వహించారు. పైడితల్లి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. చదురుగుడి, వనంగుడి భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు అమ్మవారికి ఘటాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. స్థానిక రైల్వేస్టేషన్ వద్ద ఉన్న పైడితల్లి అమ్మవారి వనంగుడిలో శమీ (జమ్మిచెట్టుకు) వృక్షానికి ఆలయ ఈఓ కేఎల్ సుధారాణి ఆధ్వర్యంలో అర్చకులు పూజలు పూజలు చేశారు. విజయదశమి పర్వదినం నాడు జమ్మిచెట్టుకు పూజలు చేస్తే ఆయురారోగ్యాలు సిద్ధిస్తాయని భక్తుల విశ్వాసం. విజయనగరం పట్టణంలో వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన దేవీ మండపాల వద్ద నిర్వహించిన దసరా వేడుకల్లో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



విజయనగరం టౌన్: జమ్మిచెట్టుకు పూజలు చేస్తున్న పైడితల్లి అమ్మవారి ఆలయ ఈఓ సుధారాణి, తదితరులు



విజయనగరం టౌన్: వనంగుడి వద్ద అమ్మవారికి ఘటాలు సమర్పించేందుకు తరలివస్తున్న భక్తులు

పైడితల్లిని దర్శించుకున్న కోలగట్ల



పైడితల్లి అమ్మవారిని దర్శించుకున్న కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: నగరంలోని అంబటి సత్రం జంక్షన్ వద్ద ఉన్న పైడితల్లి అమ్మవారి ఆలయంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పైడిమాంబ సేవా కమిటీ ప్రతినిధులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. అర్చకులు దగ్గరుండి అమ్మవారికి పూజలు చేయించి ఆశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మధుసూదనరావు, కళ్యాణ్‌కుమార్ మాట్లాడుతూ.. ఉత్తరాంధ్ర ఇలవేల్పు పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవాన్ని పురస్కరించుకుని అంబటి సత్రంలో కొలువైన పైడిమాంబకు ఏటా చల్లదనం చేయడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఇందులో భాగంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసినట్లు చెప్పారు.

సీతం కళాశాలలో నవరాత్రి ఉత్సవాలు



నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న సీతం విద్యార్థులు

విజయనగరం అర్బన్: పట్టణంలోని గాజులరేగలో ఉన్న సీతం ఇంజినీరింగ్ కళాశాల బాలికల హాస్టల్‌లో దుర్గానవరాత్రి ఉత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. దుర్గాదేవి, సర్వస్వతీదేవిలకు విద్యార్థినులు పూజలు చేశారు. విద్యార్థినులు సాంప్రదాయ దుస్తులు ధరించి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల యాజమాన్య ప్రతినిధులు మజ్జి అనురాధ, బొత్స పూజిత, వార్డెన్ ఎం.సత్యవేణి, విద్యార్థులు పాల్గొన్నారు.

సిరిమానోత్సవానికి సహకరించండి



మాట్లాడుతున్న డీఎస్పీ గోవిందరావు

- డీఎస్పీ ఆర్.గోవిందరావు

విజయనగరం టౌన్: పైడితల్లి అమ్మవారి పండగ నిర్వహణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని డీఎస్పీ ఆర్.గోవిందరావు కోరారు. హుకుంపేటలోని రామాలయంలో మంగళవారం పట్టణ యువత, ఉత్సవ కమిటీ సభ్యులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పైడితల్లి అమ్మవారి సిరిమాను ఉత్సవం, సిరిమాను తరలింపులో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీసు శాఖకు ప్రజలు సహకరించాలని కోరారు. వివిధ ప్రాంతాల నుంచి పండగను సిరిమానోత్సవాన్ని వీక్షించేందుకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. సమావేశంలో సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, టూటౌన్ సీఐ విజయానంద్, ఎస్ఐ షేక్ శంకర్, హుకుంపేట పెద్దలు, యువత, అమ్మవారి ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సిరిమానును దర్శించుకున్న కోలగట్ల

విజయనగరం: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే బంగారుతల్లి పైడితల్లి అమ్మవారి ఉత్సవంలో ప్రధాన ఘట్టమైన సిరిమానును డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మంగళవారం దర్శించుకుని పూజలు చేశారు. ఈ ఏడాది జర్జాపుపేటలో సిరిమాను చెట్టును గుర్తించారు. అక్కడ నుంచి పైడితల్లి ఆలయ పూజారి బంటుపల్లి వెంకటరావు స్వగ్రామమైన హుకుంపేటకు భారీ ఊరేగింపుగా సిరిమానును చెట్టును తీసుకువచ్చారు. పలువురు వడ్రంగులు సిరిమానును ఉత్సవానికి సిద్ధం చేస్తున్నారు. సిరిమాను తయారీని చూసేందుకు, దాన్ని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు హుకుంపేటకు తరలివచ్చి ముగ్గులతో సిరిమానును అభిషేకం చేస్తున్నారు. ఈ క్రమంలోనే డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి సిరిమానును దర్శించి పూజలు చేశారు. అక్కడ జరుగుతున్న పనులపై స్థానికుల వద్ద ఆరాతీశారు. ఆయన వెంట పూజారి బంటుపల్లి వెంకటరావు, స్థానిక కార్పొరేటర్ మీసాల రమాదేవి, కోఆప్షన్ సభ్యురాలు పద్మావతి, వైఎస్సార్‌సీపీ నాయకులు మీసాల మధుసూదనరావు, లంక నరేష్, పిల్లా రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



సిరిమానును దర్శించుకుంటున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

చెత్త సేకరణ బుట్టల పంపిణీ



చెత్త సేకరణ బుట్టలు పంపిణీ చేస్తున్న నాయకుడు పాపారావు

దత్తిరాజేరు: గ్రామాల్లో ఇంటింటి నుంచి తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించేందుకు ప్రభుత్వం సరఫరా చేసిన డస్ట్ బిన్‌లను సరయ్యవలసలో ప్రజలకు సర్పంచ్ సాలాపు లక్ష్మి భర్త పాపారావు సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభు త్వం సరయ్యవలస పంచాయతీకి 220 చెత్త సేకరణ బుట్టలు సమకూర్చిందని వివరించారు. ప్రజలు చెత్త ఆరుబయట, కాలువల్లో పారబోయ కుండా డస్ట్ బిన్‌లలో వేసి గ్రీన్ అంబాసిడర్లకు అందజేయాలని సూచించారు.

సమాజం బాగుంటేనే మనం బాగుంటాం..

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- శ్రీవిద్యాపీఠంలో ప్రత్యేక పూజలు



జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుకు అమ్మవారి ఆశీర్వచనాలు అందిస్తున్న వేదపండితులు

విజయనగరం: సమాజం బాగుంటేనే మనమంతా బాగుంటామని.. ప్రజాహితం కోసం అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపడుతున్న నగరంలోని శ్రీవిద్యాపీఠానికి మనమంతా రుణపడి ఉంటామని ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్, స్థానిక ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నగరంలోని ఫూల్‌బాగ్ వద్ద ఉన్న శ్రీవిద్యా పీఠాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. అక్కడ కొలువై ఉన్న గాయత్రీ మాతను దర్శించుకుని పూజలు చేశారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న ప్రత్యేక పూజలు, యాగంలో పాల్గొన్నారు. అనంతరం పీఠాధిపతి కోలగట్లకు అమ్మవారి ఆశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా కోలగట్ల మాట్లాడుతూ.. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని కోరుకున్నట్లు చెప్పారు.

శ్రీవిద్యాపీఠంలో జెడ్పీ చైర్మన్

నగరంలోని ఫూల్‌బాగ్ ప్రాంతంలో ఉన్న శ్రీవిద్యా పీఠాన్ని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు సందర్శించారు. విజయదశమి సందర్భంగా పీఠం ప్రాంగణంలోని గాయత్రీ మాతకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేదపండితులు అమ్మవారి ఆశీర్వచనలు ఆయనకు అందజేశారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే విజయదశమిని పండగ సందర్భంగా అందరికీ మంచి జరగాలని జెడ్పీ చైర్మన్ ఆకాంక్షించారు.

వైభవంగా శ్రీరాముడి జమ్మివేట

- బోడికొండపై స్వామివారి ఆయుధాలకు ప్రత్యేక పూజలు



స్వామివారిని ఊరేగింపుగా జమ్మివేటకు తీసుకెళ్తున్న భక్తులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలో సీతారామచంద్ర ప్రభువు జమ్మివేట కార్యక్రమంగా మంగళవారం వైభవంగా జరిగింది. విజయదశమి పర్వదినం సందర్భంగా స్వామివారి ఆయుధాలకు అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ముందుగా రాములవారి ఉత్సవ విగ్రహాలను వేద మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా బోడికొండ మెట్ల మార్గం వద్దకు తీసుకువెళ్లి జమ్మివేటను జరిపించారు. జమ్మి వృక్షానికి విశేషార్చనలు చేశారు. స్వామివారి ధనస్సు, ధనుర్బాణం, ఖడ్గం తదితర ఆయుధాలను జమ్మి వృక్షంపై ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తిరిగి స్వామివారిని ఊరేగింపుగా దేవాలయానికి తీసుకువచ్చారు. ద్వాపర యుగంలో పాండవులు జమ్మి వృక్షంపై ఆయుధాలను ఉంచేవారని, దశమి రోజున వాటిని పూజించి యుద్ధంలో విజయం పొందేవారని చరిత్ర చెబుతోంది. కృత యుగంలో కూడా శ్రీరాముడు రావణాసురుడిని సంహరించడంతో ఏటా దసరా రోజున స్వామివారి ఆయుధాలను జమ్మి వృక్షంపై ఉంచి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించడం ఆనవాయితీ అని అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో దేవస్థాన ఈఓ కిషోర్‌కుమార్, ట్రస్టు బోర్డు సభ్యుడు బూర్లె సత్యం, ఆలయ స్థానాచార్యులు నరసింహాచార్యులు, అర్చకులు వరప్రసాద్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి ఆర్థిక సహకారం



ఆశ్రమ నిర్వాహకులకు నగదు అందజేస్తున్న శ్రీను

చీపురుపల్లి: పట్టణంలోని బాపూజీ వృద్ధాశ్రమానికి గరివిడి పట్టణంలోని సహాయ్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు ఉప్పు శ్రీను రూ.10 వేల ఆర్థిక సహకారం సోమవారం అందజేశారు. తన భార్య పార్వతి జయంతిని పురస్కరించుకుని ఆశ్రమానికి నగదు అందజేయడంతో పాటు వృద్ధులకు భోజనాలు ఏర్పాటు చేశారు. సహాయ్ సంస్థ సభ్యులు కుమార్, కాంతారావు, పక్కి శ్రీను, దుబాయ్ శంకర్, చినప్పలనాయుడు, తిలక్, బాలకృష్ణ, ఆశ్రమ నిర్వాహకులు తంగుడు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రభుత్వ భవనాల ప్రారంభోత్సవం

జామి: మండల కేంద్రంలో గ్రామసచివాలయ, రైతుభరోసా కేంద్రాల నూతన భవనాలను జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు బుధవారం ప్రారంభిస్తారని ఎంపీడీఓ ఎం.సతీష్ మంగళవారం తెలిపారు. సంబంధిత సచివాలయ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

రేపు గొట్లాంలో...

బొండపల్లి: మండలంలోని గొట్లాంలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాల నూతన భవనాలను ఈనెల 26వ తేదీన గజపతినగ రం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ప్రారంభించనున్నారని ఎంపీపీ చల్లా చలంనాయుడు మంగళవారం ఓప్రకటనలో తెలిపారు. ఉద యం 11 గంటలకు ప్రారంభమయ్యే ఈకార్యక్రమానికి మండల అధికారులు, స్థానిక ప్రజాప్రతి నిధులు, మండల సర్పంచ్‌లు, ఎంపీటీసీ లు హాజరుకావాలని కోరారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్నవ్యక్తి అరెస్టు

కొత్తవలస: మండలంలోని అప్పన్నపాలెం గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఎస్.బీమయ్య అనే వ్యక్తిని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) ఎస్ఐ పి.నరేంద్ర కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం అరెస్టు చేశారు. నిందితుడి నుంచి ఆరు మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.